ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 **అనంతపురం** జిల్లా వార్తలు

గురువారం 6 ఫిబ్రవరి 2025



ప్రపంచ స్థాయికి చేరుస్తాం: కలెక్టర్ వినోద్‌కుమార్

వేదికపై మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, అధికారులు

ఇక్కడి పండ్లు నాణ్యత, రుచిలో మేటి



- మాది రైతు ప్రభుత్వం.. అండగా నిలుస్తాం
- హంద్రీనీవా విస్తరణ పనులను ప్రారంభిస్తాం
- అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌లో మంత్రి పయ్యావుల

హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

సెల్‌లో అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌'ను బంధిస్తూ..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పయ్యావుల, కలెక్టర్, ఎమ్మెల్యేలు



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా గుర్తింపు పొందిన అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్'ను ఆయన ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. వాతావరణ పరిస్థితులను అనుగుణంగా కొత్త వంగడాలను ప్రవేశపెట్టాలని ఇక్కడి రైతులు కోరుకుంటారని అన్నారు. ప్రకృతి శాపాన్ని, కోపానికి ధైర్యంగా ఎదుర్కొంటున్న జిల్లా రైతులకు హార్టికల్చర్ కాంక్లేవ్‌ను అంకితం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను మంత్రి అభినందించారు. సీఎం హాజరయ్యే స్థాయిలో త్వరలో ఈ సమావేశాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 64 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలు, రైతుల రుణం తీర్చుకుంటామని అన్నారు. నారు నుంచి కోత వరకు అనేక సమస్యలున్నాయని అన్నారు. జిల్లాలో టమోటా, ఎండు మిరప, దానిమ్మ, సీతాఫలం తదితర పంటలకు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోతకు ముందు, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడి, నాణ్యత పెంపు, మార్కెటింగ్ తదితర అంశాలను ఇక్కడ చర్చించుకొని, ముందుకు వెళతామని అన్నారు. బ్రాండ్ చాలా ముఖ్యమని, ఉద్యాన పంటల సాగులో బ్రాండ్ అనంతను సృష్టించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాలకు అనంత అరటి ఎగుమతి అవుతోందని, ఢిల్లీలో మన కర్బూజకు సహజంగానే గిరాకీ పెరిగిందని అన్నారు. ఢిల్లీలో కర్బూజను అమ్మి.. విమానంలో తిరిగి వచ్చే రైతులు

(తరువాయి 7లో)

రైతులకు అవగాహన

సమ్మేళనంలో మధ్యాహ్నం నుంచి పంటల సాగు, కోతకు ముందు, కోత తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కంపెనీల ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. కూచి పూడి నృత్య ప్రదర్శన, తబలా, ఫ్లూట్, వయోలిన్, మృదంగం వంటి సంగీత కార్యక్రమాలు అలరించాయి. ఉద్యాన పంటల సాగు, ఆ రంగంలో సేవలు అందించిన 11 మందికి మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, హరినాథ్ రెడ్డి, జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్ఓలు పల్లవి, రత్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

అనంత ఉద్యాన ఉత్పత్తులను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యం. జిల్లా వ్యాప్తంగా 1,04,021 హెక్టార్ల విస్తీర్ణంలో పలు రకాల ఉద్యాన పంటలను సాగుచేస్తున్నారు. ఏడాదికి 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన దిగుబడులతో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరు సంపాదించింది. జిల్లా జీడీపీలో 45 శాతం వాటా ఉద్యాన ఉత్పత్తుల ద్వారా లభిస్తోంది. రాష్ట్ర జీఎస్‌డీపీలో 11.73 శాతం వాటా జిల్లా ఉద్యాన ఉత్పత్తుల ద్వారా సాకారమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వర్ణాంధ్ర అనంతపూర్ విజన్-2047 సాధించేందుకు ఉద్యాన పంటలైన అరటి, ఎండు మిరప, చీనీ, టమోటా, మామిడి, డ్రాగన్ ఫ్రూట్ తదితరాలను జిల్లా గ్రోత్ ఇంజన్లుగా గుర్తించాము. ఇవి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా, జిల్లా ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తొలిసారిగా అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నాం. 'అనంత గ్లోబల్ బ్రాండింగ్ కోసం సమన్వయంతో ముందుకు వెళతాం. టీమ్ వర్క్‌తో అనంత ఉద్యాన సమ్మేళనం విజయవంతమైంది.





ప్రత్యేక ఆకర్షణ.. ఈ పండు



ఆకట్టుకున్న అరటికాయలు

ఆకట్టుకున్న స్టాల్స్

అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఏర్పాటైన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఎలైట్ బయోటెక్నాలజీస్, సిన్జాగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ గ్రీన్, సంకల్ప్ రిటైల్ స్టోర్, రామ డ్రిప్ సిస్టమ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బాయర్ క్రాప్ సైన్స్ లిమిటెడ్, జీఎం పవర్ సిస్టమ్స్, ఎకోజెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెటాఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించాయి. అవి రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయో సంస్థల ప్రతినిధులు వివరించారు. మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి శ్రీ, గుమ్మనూరు జయరాం, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్టాల్స్‌ను సందర్శించి, వివరాలను తెలుసుకున్నారు.



రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రి కేశవ్

పాల్గొన్న ప్రముఖులు, రైతులు



స్టాల్‌లో ఏర్పాటుచేసిన బనానా మల్టీ కల్చర్స్

లారీ దగ్ధం

కుందుర్పి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కోడిపల్లి మండలం నుర్పిడి కోసం వేసిన ఉలవ పంట లారీ దగ్గానికి దారితీసింది. కుందుర్పి మండలం మలయనూరు వద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగింది. మంగళూరు నుంచి బళ్లారి మట్టితో తాడిపత్రి సిమెంట్ ఫ్యాక్టరీకి వెళుతుండగా, మలయనూరు-వడ్డిపాలెం మధ్య ఓ రైతు ఉలవ కట్టెను నూర్పిడి కోసం రోడ్డుపై వేశాడు. దానిపై వచ్చిన లారీ సైలెన్సర్‌లోకి ఉలవ పొట్టు వెళ్లి శబ్దం వచ్చింది. డ్రైవర్ దిగి శుభ్రపరిచేలోగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ పాటికే లారీ పూర్తిగా కాలిపోయింది. కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగేష్ తెలిపారు.



బ్రహ్మోత్సవం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవరకొండపై కొలువైన కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో తెలుగు స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఉభయదారుడు నారాయణస్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు శిరిగుప్ప శ్రీధర్‌బాబు, వేద పండితులు సన్మానించారు. పల్లకిలో స్వామివారు పురవీధులలో విహరించారు. స్వామిని కొండమీదరాయుడు ఆలయం నుంచి దేవర కొండపైకి పల్లకిలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈఓ సాకే రమేష్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు అశోక్, పసుపుల శ్రీరామిరెడ్డి, కేశన్న, రవీంద్ర, లక్ష్మీనారాయణ, ఓబులపతి పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం, పూల పల్లకి సేవ

మాఘమాసంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా తొలి రోజు బుధవారం మట్టం పూర్తయింది. ఉత్సవాల్లో గురువారం దేవరకొండపై ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం స్వామిని పల్లకిలో కొండమీదరాయుడు దేవాలయానికి తీసుకుని వస్తారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పల్లకిలో విహరిస్తున్న కొండమీదరాయుడు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చీనీ దిగుబడులను అనంతపురం మార్కెట్ యార్డులో వేలం పాట ద్వారా మాత్రమే విక్రయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఆయన రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ డాక్టర్ శేఖర్‌బాబు, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో దాదాపు 42,490 ఎకరాల్లో 10,62,260 టన్నుల చీనీ దిగుబడులను రైతులు పండిస్తున్నారని వారి తెలిపారు. ప్రైవేట్ ప్రభుత్వ విధానాలవల్ల, పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుదల వల్ల చీనీ రైతులు భారం మోస్తున్నారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లను తట్టుకుని చీనీ పంటను పండిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించనందున దళారుల చేతుల్లో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో మొదటి రకం చీనీ టన్ను రూ.25వేలు మాత్రమే పలుకుతోందని, అదికూడా గాలివాటంగా ఉందని అన్నారు. ఈనాం విధానంలో రైతులకంటే వ్యాపారులే ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఈనామ్‌ను రద్దుచేసి, మార్కెట్‌లో వేలంపాట ద్వారా అమ్మకాలు జరిపించాలని, సూట్ విధానాన్ని రద్దు చేయించాలని కోరారు. సూట్‌కు చీనీ కాయలు కొనేవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్‌ను 10 శాతం నుంచి 4 శాతానికి తగ్గించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని రైతాంగం ఆశతో ఎదురు చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బీహెచ్ రాయుడు, చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అక్కన్న తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారానే చీనీ కొనాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి



రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శేఖర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



నిండుగా నీరు..

హెచ్చెల్సీకి 28 ఏళ్ల తర్వాత పూర్తి కోటా

బచావత్ అవార్డు ప్రకారం 32.5 టీఎంసీలు

ఎల్లెల్సీ నీటితో కలిపి వచ్చేవి 33.54 టీఎంసీలు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, మత్స్యకారులు

తుంగభద్ర ఎగువ కాలువ జలాశయం నీటితో కళకళలాడుతోంది. ఉరవకొండ నుంచి హెచ్చెల్సీకి నీరు వస్తోంది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తుంగభద్ర డ్యాం ఏర్పడినప్పటి నుంచి ఏటా బచావత్ అవార్డు ప్రకారం రావాల్సిన 32.5 టీఎంసీల నీరు కచ్చితంగా వచ్చేది. 1997 తర్వాత తుంగభద్ర డ్యాంలో పూడిక పెరిగిపోవడంతో నీటి లభ్యత తగ్గిపోయింది. ఈ కారణంతో ఏటా హెచ్చెల్సీకి రావాల్సిన నీటి వాటా తగ్గుతూ వస్తోంది. గతేడాది 17.40 టీఎంసీలకే పరిమితమైంది. దీంతో రైతుల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారాయి. అనంతపురంతోపాటు కడప, కర్నూలు జిల్లాల్లోని ఆయకట్టు భూములకు సాగు నీరు, పలు ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న హెచ్చెల్సీపై ఏటా ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది బచావత్ అవార్డు మేరకు 33.54 టీఎంసీలు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- ఆంధ్రజ్యోతి కణేకల్లు

28 ఏళ్ల తర్వాత..

హెచ్చెల్సీ ద్వారా అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. 28 ఏళ్ల తర్వాత ఈసారి పూర్తిస్థాయిలో నీరు రావడంతో ఆయకట్టు నుంచి హర్షం వ్యక్తమవుతోంది. బచావత్ అవార్డు ప్రకారం 32.5 టీఎంసీలు కేటాయించారు. ఏళ్లుగా 23 టీఎంసీలకు మించి నీరు పొందని పరిస్థితి ఉంది. ఒక్కోపుడు సాగునీటికి మాత్రమే 32 టీఎంసీల నీరు కేటాయించి ఉండేది. ఇటీవల తుంగభద్ర డ్యాం నుంచి వచ్చే నీటిలో 10 టీఎంసీలు తాగునీటి అవసరాలకు కేటాయించారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి 30.54 టీఎంసీల నీరు అందగా.. ఎల్లెల్సీ నుంచి మరో 3 టీఎంసీలు మళ్లించారు.

ప్రారంభంలో ఇబ్బందులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కాగానే.. ఆగస్టు ఒకటిన డ్యాం గేటు కొట్టుకుపోవడం నీటి రాక ప్రారంభమైంది. టీబీ డ్యాం గేటు కొట్టుకుపోయి నీరు వృథా అయింది. దీంతో ఆయకట్టు రైతుల్లో నిరాశ అలుముకుంది. ఈసారి ఆయకట్టు ఎండబెట్టుకోవాల్సిందేనని ఆందోళన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, రైతుల్లో ఆశలు నింపింది. దీంతో డ్యాంలో నీటి లభ్యత 198 టీఎంసీలకు చేరుకోగా.. అందులో హెచ్చెల్సీ వాటాగా 30.54 టీఎంసీలు కేటాయించారు. సాధారణంగా డ్యాంలో 212 టీఎంసీలు నీరు ఉంటే హెచ్చెల్సీకి కేటాయించాల్సిన వాటా పూర్తిస్థాయిలో బచావత్ అవార్డు ప్రకారం అందేది. 14 టీఎంసీలు తక్కువ ఉన్నప్పటికీ ఎల్లెల్సీ వాటాలో మూడు టీఎంసీలు మళ్లించడంతో ఈ ఏడాది పూర్తిస్థాయిలో అందుకోగలిగారు.

10 వరకు సరఫరా

హెచ్చెల్సీకి కేటాయించిన 33.54 టీఎంసీల నీటిలో ఇప్పటికే 32.85 టీఎంసీలు జిల్లాకు చేరాయి. మిగిలిన నీరు ఈనెల 10 వరకు విడుదల చేయనున్నారు. ఈ నీటిని ఎలా వినియోగించుకోవాలో హెచ్చెల్సీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎట్టకేలకు ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన ప్రారంభంలోనే హెచ్చెల్సీకి పూర్తిస్థాయిలో నీరు రావడంతో భవిష్యత్తుపై రైతులు, ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

ఏటా వస్తే బాగుంటుంది..



విప్ కాలవ శ్రీనివాసులు చొరవతో ఈసారి పూర్తిస్థాయిలో నీటిని అందుకోగలిగాం. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. భవిష్యత్తులో కూడా ఇలాగే ఏటా పూర్తిస్థాయిలో నీరు వస్తే బాగుంటుంది. - జగన్నాథ్, రైతు, గంగలాపురం

ఎంతో ఉపయోగం



హెచ్చెల్సీకి ఈ ఏడాది పూర్తిస్థాయిలో నీరు రావడం మాకు ఎంతో సంతోషం. దీంతో కణేకల్లు చెరువులో చేపల పెంపకానికి ఎంతో దోహదం చేస్తుంది. ఈ ప్రాంతంలో దాదాపు 144 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చెరువులో నీరు నిండుగా ఉండడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - చెన్నకేశవులు, మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు, కణేకల్లు

పెరిగిన భూగర్భజలాలు



కణేకల్లుతోపాటు గంగలాపురం, రచ్చుమర్రి తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి, బోర్లలో నిండుగా నీరు వస్తోంది. దీంతో రెండో పంట కింద వరినార్లు వేసుకుని, సాగు చేసుకుంటున్నాం. విశ్వేశ్వర చెరువులో నీరు ఉంటే అనేక రైతు కుటుంబాలు పంటలు పండించుకుని, జీవనం సాగించేందుకు ఆస్కారం ఉంటుంది. - గోవిందు, రైతు, గంగలాపురం



రబీలోనూ నష్టాలే..! 6

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు 6

పది విద్యార్థిని ప్రసవం 7

డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడి
చికిత్స పొందుతూ మృతి



వారధిగా ఉంటూ సాయం చేయాలి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్
పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ, న్యాయ సహాయం కోసం వచ్చే బాధితుల మధ్య వారధిగా ఉంటూ సహాయాన్ని అందించేవారే పారా లీగల్ వలంటీర్లు అని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ హాలులో పారా లీగల్ వలంటీర్లకు మొదటి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. బాధితులకు న్యాయ సహాయం అందించే సమయంలో తమ పాత్ర ఎలా నిర్వర్తించాలో వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పద్మజ, నామాల హరికృష్ణ, ఐటికె నల్లప్ప పాల్గొన్నారు.

గిరిజనుల చైతన్యమే ధ్యేయం

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు

ఇంటర్వ్యూ interview


రామాంజనేయులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను చైతన్యం చేయడమే ధ్యేయంగా పని చేస్తానని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వాటి లబ్ధిని పొందేలా చర్యలు తీసుకుంటానన్నారు. సబ్సిడీ రుణాలు రాగానే, అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రశ్న : ధర్తీ ఆబా జన్ జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పనులు ఎలా జరుగుతున్నాయి..?

జవాబు: జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ పథకం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎలక్ట్రిసిటీ పనులు పూర్తయ్యాయి. జల్‌జీవన్ మిషన్, అగ్రికల్చర్, స్కిల్ డెవలప్‌మెంట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

ప్ర : వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారా..?

జ: వసతిగృహాల్లో ఇప్పటికే చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని బెడ్‌షీట్లు, దుప్పట్లు తెప్పించాం. మెష్‌లను ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా చూస్తున్నాం. డైట్ బిల్లులు సక్రమంగా జమయ్యాయి.

ప్ర: పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు..?

జ: పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రతి వసతిగృహంలో స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేశాం. వారంలో ఒక రోజు ప్రత్యేక ట్రైనర్లతో సబ్జెక్టులను బోధిస్తున్నాం. ఎవరైనా విద్యార్థులు సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి విద్యార్థి పాసయ్యేలా సన్నద్ధం చేస్తున్నాం.

ప్ర: గురుకుల పాఠశాలల్లో ఫ్యాకల్టీ కొరతను ఎలా అధిగమిస్తారు?

జ: గురుకుల పాఠశాలల్లో ఇదివరకూ ఫ్యాకల్టీ కొరత ఉన్న మాట వాస్తవమే. అయితే పైస్థాయి అధికారుల అనుమతితో ప్రైవేట్ టీచర్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నాం.

ప్ర: గిరిజనులకు ఏ ఏ పథకాలు వర్తింపజేస్తున్నారు?

జ: ఇప్పటి వరకూ గిరిజనులకు సంబంధించిన అన్ని పథకాలు వర్తింపజేశాం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మరిన్ని పథకాలు వర్తింపజేయనుంది. ప్రస్తుతం 0-200 యూనిట్ల వరకూ కరెంటు బిల్లులు లేని పథకం అమలు అవుతోంది.

ప్ర: గిరిజనుల స్వయం ఉపాధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జ: గ్రామాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు ఉన్నారు. వారిలో యువతకు వారి చదువును బట్టి స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.


నేడు సమగ్రశిక్ష ఏఎస్పీడీ రాక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(ఏఎస్పీడీ) గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఏఎస్పీడీ రవీంద్రనాథ్ జిల్లా పర్యటనలో భాగంగా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులతో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత జిల్లాలో కేజీబీవీ స్కూళ్లు, భవిత కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం, అటెండెన్స్ తదితర అంశాలను పరిశీలించనున్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.

రబీలోనూ నష్టాలే..!

వేరుశనగ రైతుకు మళ్లీ నష్టాలే. ఖరీఫ్‌లో అననుకూల వర్షాలతో పంట చేతికి రాలేదు. దీంతో చాలాచోట్ల రైతులు పంటను తొలగించుకున్నారు. రబీలోనూ నష్టాలు తప్పలేదు. వర్షాలు, మంచు ప్రభావంతో తేమ పెరిగి, మచ్చ తెగులు విపరీతంగా సోకాయి. దీంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. సాధారణంగా 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈసారి 2 నుంచి 3 క్వింటాళ్లకే పరిమితమైంది. ధర కూడా అమాంతం పడిపోయింది. నెల క్రితం వరకు రూ.8 వేలు పలికిన క్వింటాల్ వేరుశనగ ధర.. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. తెగుళ్ల ప్రభావంతో వేరుశనగ కట్టె కూడా నల్లగా మారిపోయింది. దీంతో గ్రాసానికి కూడా పనికిరాదని రైతులు వాపోతున్నారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో..



మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రూ.1.50 లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తెగుళ్లు సోకి వేరుశనగ కట్టె నల్లగా మారిపోయింది. దిగుబడి తగ్గడమే కాకుండా, ధర కూడా అమాంతం పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని.. ఆందోళన చెందుతున్నాం.

- జయన్న, రైతు, ఒంటారెడ్డిపల్లి


నల్లగా మారిన వేరుశనగ కట్టె

- పాతాళానికి ధరలు
- అమాంతం రూ.3 వేలు తగ్గిన వైనం
- అన్నదాత అప్పులపాలు

● వేరుశనగను దెబ్బతీసిన మచ్చ తెగులు ● దారుణంగా తగ్గిపోయిన దిగుబడి ● ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లే..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్, బెళుగుప్ప మండలాల పరిధిలో 6 వేల హెక్టార్లకు పైబడి ఈసారి రబీలో విత్తన వేరుశనగ సాగు చేశారు. సెప్టెంబరులో పంట పెట్టారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి కింద వెచ్చించారు. రెండు నెలల వరకు పంట బాగానే ఉంది. ఆ తరువాత పంట ఎదుగుదల లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు, అధిక మంచు కారణంగా పంటకు మచ్చ తెగులు సోకాయి. దీంతో దిగుబడి తగ్గిపోయింది. వేరుశగన కట్టె నల్లగా మారిపోయి, కాయలన్నీ భూమిలోపలికి కుచించుకుపోయాయి. ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకు 5 నుంచి 10 కాయలు మాత్రమే దిగుబడి వచ్చింది. కొన్ని చెట్లలో కాయలే కనిపించని దుస్థితి. సాధారణంగా ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి తెగుళ్ల ప్రభావంతో 2 నుంచి మూడు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి దక్కవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

అమాంతం పడిపోయిన ధర

విత్తన వేరుశనగ క్వింటాల్ ధర నెలరోజుల క్రితం రూ.8 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.5వేలు పలుకుతోంది. అమాంతం రూ.3 వేలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడిలేని సమయంలో ధర కూడా పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కర్ణాటకలోని చెళ్లికెరకు తీసుకెళ్లి విత్తన వేరుశనగను అమ్ముతున్నారు. అక్కడ కూడా ధర దక్కక రైతు డీలా పడిపోయాడు. ప్రస్తుత ధరల ప్రకారం ఎకరాలో దిగుబడి విక్రయిస్తే రూ.15 వేలు కూడా రావట్లేదు. పెట్టుబడి మాత్రం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టారు. దీంతో భారీగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.




పొలంలోనే నల్లగా మారిన వేరుశనగ కట్టె

చెట్టుకు 5 నుంచి 8 కాయలే..



రబీలో నాకున్న మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రెండు నెలలపాటు పంట ఎదుగుదల బాగానే ఉంది. ఆ తరువాత తెగుళ్లు సోకాయి. వేరుశనగ చెట్టంతా నల్లగా మారిపోయి, పూర్తిగా దిగుబడి పడిపోయింది. కోత కోయడంతో చెట్టుకు 5 నుంచి 8 కాయలు మాత్రమే ఉన్నాయి. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో.. తెలియదు. వేరుశనట కట్టె కూడా నల్లగా మారిపోవడంతో పశువులకు మేతగా పనికిరాదు.

- హనుమంతరాయుడు, రైతు, జెల్లిపల్లి

తేమశాతం ఎక్కువ కావడంతోనే ...

రబీలో సాగు చేసిన వేరుశనగ పంటకు ఎక్కువగా మచ్చతెగులు సోకడానికి ప్రధాన కారణం తేమశాతం ఎక్కువ కావడమే. సరైన సమయంలో తగిన మోతాదులోనే వేరుశనగకు నీరు వదలాలి. ఇష్టారాజ్యంగా ఇస్తే తెగులు ఉధృతంగా వ్యాపిస్తాయి. కాండం, మొదలు ఎండుకుపోయి, ఆకు రాలిపోతుంది. తద్వారా వేరుశనగ దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశాలుంటాయి.

- యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

నేటి నుంచి జకినీ మాత ఉత్సవాలు


సునామ జకినీమాత


మల్యామ జకినీ మాత

గుత్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అరెకటికల ఆరాధ్య దేవతలైన సునామ జకినీమాత, మల్యామ మాత జాతర ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. గుత్తి ఆర్ఎస్ రోడ్డులో వెలసిన సునామ జకినీ మాత ఆలయంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరవుతారన్నారు. వచ్చే భక్తులకు తాగునీరు, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వారు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజామున అమ్మవార్లకు అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను స్థానిక సాయిబాబా దేవాలయం నుంచి అమ్మవారి దేవాలయం వరకు కన్యలు, ముత్తైదువులు పూర్ణకుంభాలతో ఊరేగింపు, పూర్ణ కళశాలతో అభిషేకం కార్యక్రమాలు చేస్తామన్నారు. భక్తులచే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రి చిన్నారులచే నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవార్లకు పంచామృతం, సుగంధ ద్రవ్య పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకం, భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఉదయం 7గంటలకు అమ్మవార్లకు గంగాస్నానం, గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి కన్యలచే పూర్ణకుంభాలతో అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు, అనంతరం అమ్మవార్లకు పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి లడ్డూ వేలం నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల అరెకటిక కుల సంఘాలు, ప్రజా ప్రతినిధులతో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు లక్ష దీపారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.


భోజన సౌకర్యాలను పరిశీలిస్తున్న కమిటీ నిర్వాహకులు

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత

గుంతకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో గుంతకల్లు రైల్వే డివిజన్ కొంతమేర కోతకు గురైంది. ఈ డివిజన్‌లోని రాయచూరు-నాల్వార్ రైల్వే సెక్షన్‌ను సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి (సౌత్ సెంట్రల్) మారుస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. రాయచూరు-నాల్వార్ సెక్షన్‌కు గుంతకల్లు డివిజన్‌లో 107.58 కి.మీ. లైన్, 12 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంతకల్లు రైల్వే డివిజన్ మారనున్న నేపథ్యంలో పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం రాయచూరు-నాల్వార్ మార్గాన్ని ఎస్సీ రైల్వేలోకి మార్చాలని నిర్ణయించారు. గతంలో గుంటూరు రైల్వే డివిజన్, హుబ్లీ డివిజన్ల ఏర్పాటు సందర్భంగా కూడా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత వేశారు. పలు రైల్వే సెక్షన్లను ఆ డివిజన్లలోకి మార్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉన్నప్పుడు సికింద్రాబాద్, విజయవాడ తర్వాత పెద్ద విస్తీర్ణం కలిగిన మూడో డివిజన్‌గా ఉండేది. ప్రస్తుతం సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి మారినందున విజయవాడ తర్వాత రెండో పెద్ద డివిజన్‌గా మారింది. రాయచూరు-వాడి రైల్వే సెక్షన్‌లో రెండు పవర్ జనరేషన్ ప్లాంట్లు ఉన్నందున బొగ్గు రవాణాకు ఈ సెక్షన్ మూడు రైల్వే జోన్‌లకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ కారణంగా మధ్య రైల్వే, దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే జోన్లలో వాడి జంక్షన్ అత్యంత కీలకం కానుంది. పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం వాడి జంక్షన్‌ను క్రూ చేంజింగ్ పాయింట్‌గా రైల్వేశాఖ గుర్తించింది.

ఇక సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి..


గుంతకల్లు రైల్వే స్టేషన్

లాభాలూ ఉన్నాయ్..

జోన్ మార్పు కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపునకు గురైంది. ఆదాయ పరంగా నష్టం, జోనల్ కేంద్రం దూరంగా ఉండటం ఇబ్బందికరమే అయినా, కొన్ని ఉపయోగాలు ఉన్నాయి. సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు వల్ల విశాఖపట్టణం-విజయవాడ-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ, ట్రాఫిక్ పెరుగుతుంది. దీని వల్ల రాష్ట్ర రాజధానికి రైళ్లు లేక ఇబ్బందిపడుతున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రయాణికులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు మేలు జరగనుంది. రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మినహా డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లు లేక ఇబ్బందులు పడుతున్న సీమ ప్రజలకు కష్టాలు తీరే అవకాశాలు ఉన్నాయి. గతంలో రద్దయిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరుతోపాటు, మరిన్ని రైళ్లు వచ్చే పరిస్థితులు ఏర్పడుతాయి.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 600 బుధవారం టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4,200, సరాసరి రూ.11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాకు గుంతకల్లు డివిజన్ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07117) రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి రెండు రోజుల తర్వాత 16వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07118) ఈ నెల 17న దానాపూర్‌లో మధ్యాహ్నం 3-15 గంటలకు బయలుదేరి 19వ తేదీ మధ్యాహ్నం 1-55 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07119) ఈ నెల 18వ తేదీ రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి 20వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07120) ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3-15 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి 23వ తేదీ మధ్యాహ్నం 1-45 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, నూళేహళ్లి, సేడం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి పిప్రియా, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళుతుందని వెల్లడించారు.

చేనేతకు పూర్వ వైభవం

- లోకేశ్ చొరవతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు
- మంత్రి సవిత


దుస్తులు కుడుతున్న మంత్రి సవిత

హిందూపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యమైన చేనేత రంగానికి పూర్వవైభవం తెస్తానని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం హిందూపురం పట్టణ పరిధిలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో హిందూపురం నియోజకవర్గంలో 3వేల కుటుంబాలకు ఉచిత జాకార్డ్‌లు మంజూరు చేశామని తెలిపారు. వైసీపీ హయాంలో చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లేక చాలా మంది వృత్తికి దూరమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం చేనేతలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. దీంతో వారి సమస్యలు దగ్గరగా చూశాక ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. 1989లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హిందూపురంలో తెలుగు చేనేత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారని వివరించారు. శిక్షణ పొందిన 65 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా మిషన్ కుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఏడీ హరిక్రిష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ, ఫార్మా-డి కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఏపీసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో ఇప్పటికే ప్రవేశాలు జరిగాయన్నారు. మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై, ఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమింగ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ పొంది ఉండకూడదన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారు ఫీజు రీయింబర్స్‌కు అనర్హులని పేర్కొన్నారు. ఈనెల 6,7 తేదీల్లో జేఎన్టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైతులు, కంపెనీలకు వారధిగా..

ఆకట్టుకున్న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ స్టాల్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం రైతులు, కంపెనీలకు వారధిగా నిలిచింది. కార్యక్రమంలో వివిధ పంటలకు సంబంధించిన ఫర్టిలైజర్లు, మిషనరీలు, డ్రోన్ స్ప్రేయర్స్, డ్రిప్, కొత్త రకాల పండ్ల వంగడాలు ప్రదర్శించారు. సాధారణ మందుల వాడకాలకు భిన్నంగా సాంకేతిక సాగులో మెలకువలు, అగ్రికల్చర్ యాప్‌లతో పంటలు సాగుచేసే విధానాలు గురించి పలు కంపెనీ ప్రతినిధులు రైతులకు వివరించారు. కాంక్లేవ్ స్టాల్స్ ప్రతినిధులు, రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

రైతులు ఆసక్తి చూపారు



అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ ప్రోగ్రామ్‌లో మా కంపెనీ తరఫున పలు రకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌ను స్టాల్‌లో ఉంచాం. మా కంపెనీ మందులు, ఉపయోగాలు, ఎలా సాగు చేయాలన్న అంశాలపై రైతులకు వివరించాం. ఇందులో ప్రత్యేకంగా సాన్‌మ్యాక్స్ ఎనర్జీ ప్రొడక్ట్, పోషక్ సూపర్‌స్టార్ ప్రొడక్ట్‌లపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపారు. దాదాపు 30 మంది రైతులు వీటి గురించి తెలుసుకున్నారు. దాదాపు 10 మంది రైతుల వరకూ ఆ ప్రొడక్ట్ మాకు కావాలని మా కంపెనీ డీటైల్స్ తీసుకెళ్లారు. కాంక్లేవ్‌లో స్టాల్స్ ఏర్పాటుతో బిజినెస్‌తో పాటు.. వివిధ రకాల రైతులకు మందుల గురించి వివరించే అవకాశం కలిగింది.

- శివగోపాల్, స్టోర్ మేనేజర్, సాన్‌న్యూట్రీ స్టార్

ధరలు తగ్గిస్తే మేలు



కాంక్లేవ్ ప్రోగ్రాం గురించి విని గుంతకల్లు నుంచి వచ్చాను. నాకు ఐదెకరాల పొలం ఉంది. నాలుగు ఎకరాల్లో మునగ, ఒక ఎకరంలో కంది పంట సాగు చేశా. పంటకు మచ్చ ఉంది. అందుకోసమే స్టాల్స్‌ను పరిశీలించా. నేను సాధారణంగా తీసుకునే ఫర్టిలైజర్స్ మందుల కన్నా.. కొత్త కొత్త కంపెనీలు ఉన్నాయి. అదే విధంగా నా పంటకు సంబంధించి మిషనరీ అవసరముంది. అయితే స్టాల్స్‌లో మిషనరీ ఐటమ్స్ కనిపించలేదు. పురుగు మందుల వాటి గురించి బాగానే చెప్పారు. కానీ ధరలు కొంచెం ఎక్కువగా ఉన్నాయి. మాలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని ధరల విషయంలో కంపెనీలు దిగొస్తే బాగుంటుంది.

-జగన్నాథ్, రైతు, వెంకటాంపల్లి, గుంతకల్లు నియోజకవర్గం

మందులు కొనుగోలు చేశా..



నేను కంబదూరులో 12 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నా. 6 ఎకరాల్లో చిక్కుడు పంటను సాగు చేస్తున్నా. స్టాల్స్‌లో పలు రకాల ఎరువులు, పురుగుల మందులకు సంబంధించిన పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ ఏర్పాటు చేశారు. చాలా బాగుంది. ఎన్నో డబ్బులు ఖర్చు పెట్టుకొని అనంతపురం, ఒక్కొక్కసారి బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లి మందులు కొనుగోలు చేసేవాణ్ణి. అయినా కొన్నిసార్లు పనిచేసేవి కావు. కానీ ఈ స్టాల్స్‌లో కొత్త కంపెనీలు ఫర్టిలైజర్స్‌ను చూపించారు. ఇందులో సాన్‌మ్యాక్స్ ఎనర్జీ ప్రొడక్ట్ వాడకంపై వివరించారు. పూత గ్రోతింగ్, మొగ్గ, దిగుబడి విషయంలో ఈ మందు బాగా పనిచేస్తుందని చెప్పారు. ధర కూడా రీజనబుల్‌గా ఉంది. అందుకే పంటకు కావాల్సిన మందులు కొనుగోలు చేశాను.

- రాఘవేంద్ర, రైతు, కంబదూరు

ఆన్‌లైన్‌లో అవగాహన



డిజిటల్ గ్రీన్‌తో రైతులకు అవగాహన కల్పించి, మెలకువలు అందించేందుకు హార్టికల్చర్ శాఖ అనుసంధానంతో నూతన ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ఇప్పటికే 10 నిమిషాల నిడివితో లఘుచిత్రాలు రూపొందించి రైతులకు చూపించి అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మిరప, టమోటా, పసుపు పంటల సాగు, మెలకువలు తదితర అంశాలపై ఐవీఆర్(ఇంటరాక్ట్ వాయిస్ రికార్డ్ సిస్టమ్)తో అవగాహన కల్పిస్తున్నాం. స్టాల్స్‌లో పంట నాణ్యతను రూపొందించే మిషనరీతో అవగాహన కల్పించాం. దాదాపు 100 మందికిపైగా రైతులు వారి మొబైల్ నెంబర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారందరికి పంట పద్ధతులు, మెలవకులు, సాగు విధానా లపై ఐవీఆర్ ద్వారా, లఘుచిత్రాల ద్వారా అవగాహన కల్పిస్తాం.

- మస్తాన్‌వలి, ప్రోగ్రామ్ మేనేజర్

మొక్కలు కొనుగోలు చేశారు



నేను రైతులకు కొత్త వంగడాలను పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో నర్సరీని స్థాపించా. కడపలో నర్సరీ ఏర్పాటు చేసుకొని చీనీ పంటలో అత్యంత దిగుబడి వచ్చే పంటపై సెర్చ్ చేశా. అందులో భాగంగా బ్రెజీలియన్, మాండరిన్ ఆరెంజ్ మొక్కలను నర్సరీలో ఉంచా. వీటితో పాటు పనస వంగడాన్ని రైతులకు పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నా. అందులో భాగంగా ఈ హార్టికల్చర్ కాంక్లేవ్ మీటింగ్‌లో స్టాల్ ఏర్పాటు చేశా. మినిమమ్ సీడ్‌లెస్‌తో ఉండే బ్రెజీలియన్ మొక్క ధర రూ. 100లు, మాండరిన్ మొక్క ధర రూ. 250లు ఉంది. ఈ మొక్కలు ఐదు దశల్లో పంట ఇస్తాయి. దాదాపు 20 మంది రైతులు మొక్కలను కొనుగోలు చేశారు. పనస పండుకు సంబంధించి ఒక్కో మొక్క ధర రూ. 600లు ఉంది. ధర ఎక్కువ ఉండటంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు. 9 నెలల్లో చేతికొచ్చే ఈ పంటపై దృష్టి సారిస్తే అధిక లాభాలు గడించవచ్చు.

- సంతోష్‌రెడ్డి, సంతోష్ చీనీ నర్సరీ, బోనాలగ్రామం, కడప జిల్లా

డ్రిప్‌కు స్పందన



ప్రస్తుతం డ్రిప్ ప్రతి రైతుకు అత్యవసరం. మా కంపెనీని హార్టికల్చర్ శాఖ కు అనుసంధానించి ముందుకు వెళ్తున్నాం. స్టాల్స్‌లో డ్రిప్‌కు సంబంధించి పరికరాలు తీసుకొచ్చాం. చాలా మంది రైతులు వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో 5 ఎకరాలకు డ్రిప్‌నకు 90 శాతం వరకూ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. పదెకరాలకు 70 శాతం సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రైతులు భరించాల్సి ఉంటుంది. దాదాపు 30 నుంచి 40 మంది రైతులు డ్రిప్ కావాలని అడిగి వెళ్లారు.

- భాస్కర్, డీసీఓ, నాథలిన్ ఇరిగేషన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్

డ్రోన్ స్ప్రేయర్‌తో సులభంగా పిచికారీ



డ్రోన్ స్ప్రేయర్ ద్వారా మొక్కలకు పురుగుమందుల పిచికారి సులభతరమవుతుంది. ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో కాంక్లేవ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాం. ఈ డ్రోన్ స్ప్రేయర్‌లో 10 లీటర్ల కెపాసిటీ ట్యాంకు ఉంటుంది. ఒక ఎకరాకు 10 లీటర్లు స్ప్రే చేస్తే... రూ. 300లు చార్జ్ చేస్తాం. ఇదీ ముఖ్యంగా వేరుశనగ, టమోటా, కళింగర, అరటి తదితర పంటలకు ఉపయోగిస్తారు. దాదాపు 20 మంది రైతులు ఈ డ్రోన్ స్ప్రేయర్ కావాలని ఫోన్ నెంబర్లు ఇచ్చారు. అలాగే స్టాల్స్ న్యూటన్, మిరాక్ కంపెనీల పెస్టిసైడ్స్‌ను తీసుకొచ్చాం.

- మణికళ్యాణ్, ఏరియా మేనేజర్, ఇఫ్కో కంపెనీ



పరికరాల గురించి వివరిస్తున్న స్టాల్ నిర్వాహకుడు



స్టాల్స్ నిర్వాహకుడికి కలెక్టర్ సూచనలు



ఎంత కళాత్మకంగా ఉందో..

హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉన్నారని అన్నారు. జిల్లాలో పండించే ఉద్యాన పంటల నాణ్యంగా, రుచిగా ఉంటాయని, ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయని అన్నారు. ఉరవకొండలో సామూహిక ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 50వేల ఎకరాలకు టీడీపీ హయాంలో నీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. వైసీపీ హయంలో ఆ ప్రాజెక్టును గాలికి వదిలేశారని విమర్శించారు. త్వరలోనే ఆ ప్రాజెక్టును పునఃప్రారంభిస్తామని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను సీఎం త్వరలోనే ప్రారంభిస్తారని అన్నారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వినిపించాలి: కాలవ



అనంత బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వినిపించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. దశాబ్దాలుగా అనంత ఉద్యాన పంటలకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో రైతులు అనేక రకాల ఉద్యాన పంటలు పండిస్తున్నారని అన్నారు. మన ప్రాంతంలో పండించిన ఉద్యాన ఉత్పత్తులను జాతీయ మార్కెట్‌లో ఎక్కువ ధరతో కొంటున్నారని అన్నారు. ద్రాక్ష, నిమ్మ, చీనీ దిగుబడులు జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందాయని అన్నారు. అరటి, బొప్పాయి ఇటీవల పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతోందని అన్నారు. నాణ్యత పరంగా ప్రత్యేక ముద్ర వేసుకున్న జిల్లా ఉద్యాన ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించేలా కృషి చేయాలని అన్నారు. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

రైతులను ఆదుకుంటాం: టీజీ భరత్



అనంత ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమ్మేళనం రైతులకు మరింత ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సహకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

జీవీఏపై అవగాహన పెరగాలి: రాజశేఖర్



రైతులకు ఉత్పత్తికి జోడించిన విలువ (జీవీఏ) గురించి తెలియజేయాలని వ్యవసాయ, అనుబంధ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు. ఒకటి నుంచి రెండు శాతం జీవీఏ పెంచితే రైతుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. జిల్లా యంత్రాంగం ప్రతి సమావేశాల్లో జీవీఏ లెక్కలను రైతులకు చెబుతూ ఉంటే ప్రతి ఒక్కరికీ తెలుస్తుందని అన్నారు. అనంతను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. దేశంలోనే అరటి, చీనీ ఉత్పత్తుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందని అన్నారు. కోత తర్వాత నష్టాన్ని తగ్గించుకుంటే మరింత ఆదాయం వస్తుందని అన్నారు. ఉద్యాన దిగుబడులను అమ్ముకోవడంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు అలవాటు పడితే మరింత ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురాడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి: అమిలినేని




కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో టమోటా పంట సాగుచేస్తున్నారని, టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, చింత పండు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలోనూ స్టాల్స్ ఏర్పాటు చేసి, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

బంగారం పండిస్తారు : పరిటాల సునీత




నీరు ఉంటే బంగారం పండించే రైతులు జిల్లాలో ఉన్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చీనీ, దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, సీతాఫలం, టమోటా తదితర ఉద్యాన పంటలు పండిస్తున్నారని అన్నారు. కానీ మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోతున్నారని అన్నారు. మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే రైతుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పదెకరాల వరకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కాంక్లేవ్‌లోని పంటల జాబితాలో దానిమ్మ, సీతాఫలం ఉత్పత్తులను చేర్చాలని కోరారు.

ధరలు తగ్గకుండా చూడాలి : జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రి ప్రాంతంలో అరటి పంటను టిష్యూ కల్చర్ ద్వారా సాగు చేస్తున్నారని, అరటి ధరలు తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. సీఎం చంద్రబాబు చొరవతో గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతి అవుతోందని, దీంతో ధరలు పెరిగాయని అన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. కలెక్టర్‌ను ఆయన అభినందించారు.

అరటి ఎగుమతికి కృషి : అంబికా



జిల్లా నుంచి లక్ష టన్నుల అరటిని ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. జిల్లా రైతులు కష్టపడి పని చేసి, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారని, ఉద్యాన పరిశ్రమను దేశ వ్యాప్తంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. జిల్లాలో హార్టికల్చర్ ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసి, దేశంలోని వివిధ నగరాలకు వీలైనంత త్వరగా ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం కల్పిస్తామని, గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి : జయరాం



టమోటా రైతుకు గిట్టుబాటు కల్పించి ఆదుకోవాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. 2014-19 కాలంలో సీఎం చంద్రబాబు డ్రిప్ పరికరాలు అందజేసి ఆదుకున్నారన్నారని అన్నారు. ప్రస్తుతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్లను అందించే చర్యలు చేపడుతున్నారని అన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహిస్తాం: శేఖర్‌బాబు



జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శేఖర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకువచ్చిందని తెలిపారు. అందులో పెట్టుబడులు పెట్టేవారికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ప్రకటించిందని అన్నారు. డీ హైడ్రేషన్ యూనిట్లను అపరిమితంగా మంజూరు చేస్తామని అన్నారు. 040 - 45901100 నంబర్‌ను కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.



స్టాల్స్‌లో వివిధ రకాల ఫలాలు

ఎంఓయూలు కుదుర్చుకున్న ఏడు కంపెనీలు



అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో మంత్రి, కలెక్టర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంలో అవగాహన ఒప్పందా(ఎంఓయూ)లను కుదుర్చుకున్నాయి. మైక్రో అల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (స్పెయిన్‌కు చెందిన ఆల్గే ఎనర్జీ అనుబంధ సంస్థ), సిద్దార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ), అననా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంట ఉత్పత్తుల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు.

మైక్రో అల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో అల్గే ఆధారిత సాంకేతికతను సమకూర్చనుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో అల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని పెంచేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తారు.

సిద్దార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఎస్‌కే బనానాను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా ప్రీ కూల్ చేస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్దార్థ పల్ప్, డీ హైడ్రేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకుంటారు.

కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం, ఇతర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేస్తారు. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయకమైన ధరతో విక్రయించేలా చొరవ చూపుతారు.

గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. జిల్లా రైతులకు మద్దతు ధర కల్పిస్తారు. ఇతర ప్రాంతాల్లో ధరలను రైతులకు తెలియజేస్తారు. తద్వారా మెరుగైన ధర దక్కేలా చొరవ చూపుతారు.

అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రీటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకు ఎరువులను అందజేస్తారు.

బనానా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. అరటి నార నుంచి వస్త్రాలను తయారు చేయడంతోపాటు అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పతులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను సేకరిస్తారు.

డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడి

చికిత్స పొందుతూ మృతి



కృష్ణమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు అడిగిన డబ్బు ఇవ్వలేదని కన్నతల్లినే కడతేర్చాడు. ఈ సంఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అమర్‌దీప్ భార్య వదిలేయడంతో పనీపాట లేకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈక్రమంలోనే తన వ్యసనాలకు తల్లి అయిన బెల్లం కృష్ణమ్మ(68)ను ఈ నెల మూడో తేదీ డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో కట్టెతో తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు, బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఇందిర తెలిపారు. మృతురాలి కుమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్ మోసం

రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న మహిళ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాడి వలలో చిక్కిన ఓ మహిళ రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న సంఘటన మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ ఇటీవల పుట్టినిల్లు అయిన ఓబుళంపల్లికి వచ్చింది. ఈనెల రెండో తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'ఆరోగ్యశ్రీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాను, మీనాన్నకు ఆరోగ్యశ్రీ కింద రెండేళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. దానికి సంబంధించి రూ.40వేలు ప్రభుత్వం నుంచి బిల్లు పెండింగ్‌లో ఉంది. ఆ మొత్తాన్ని ఇప్పుడు మీ బ్యాంకు ఖాతాలోకి జమచేస్తాను. అందుకోసం మీ సెల్‌ఫోన్‌కు ఒక లింకు పంపిస్తున్నాను. ఓపెన్ చేసి లింక్‌పై క్లిక్ చేయండి' అని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి చెప్పాడు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింకుపై క్లిక్ చేసింది. వెంటనే రూ.47,287 బ్యాంకు ఖాతా నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. డబ్బు పోయిన విషయాన్ని ఆమె వెంటనే ఆ గుర్తు తెలియని వ్యక్తి దృష్టికి తీసుకెళ్లగా ఏదో సమస్య ఉన్నట్టు ఉంది. మరోసారి లింకు పంపిస్తాను క్లిక్ చేస్తే పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం అంతా కలిపి జమవుతుందని తెలిపాడు. దీంతో ఆమె మళ్లీ లింక్‌ను క్లిక్ చేసింది. రెండోసారి రూ.40వేలు కట్ అయినట్లు మళ్లీ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ మళ్లీ ప్రశ్నించగా ఇదొక సారి లింకు పంపిస్తాను క్లిక్ చేయమని చెప్పడంతో ఆ మహిళ నమ్మి క్లిక్ చేసింది. దీంతో రూ.17500 నగదు మాయమైంది. మూడు విడతల్లో మొత్తం రూ.1.04లక్షలు పోగొట్టుకుంది. వెంటనే తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి 1903 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి జరిగిన ఆన్‌లైన్ మోసం తెలిపింది. బాధితు రాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పది విద్యార్థిని ప్రసవం

యువకుడిపై పోక్సో కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థిని ప్రసవించడం పట్టణంలో కలకలం రేపింది. ఓ యువకుడు మాయమాటలు చెప్పి, బాలికను లోబరచుకున్నట్లు తెలిసింది. విద్యార్థిని బుధవారం ప్రసవించడంతో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు...పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాలిక ఈనెల 4న పాఠశాలలో ఉండగా కడుపు నొప్పి వచ్చింది. దీంతో హెచ్‌ఎం.. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు వచ్చి కుమార్తెను ఇంటికి పిలుచుకెళ్లారు. బుధవారం కూడా కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి, బాలిక గర్భవతి అని తెలిపారు. అనంతరం బాలికకు వైద్యులు సాధారణ డెలివరీ చేయగా.. మగబిడ్డ జన్మించింది. బాలిక గర్భం దాల్చడానికి కారణం ఎవరని తల్లిదండ్రులు, పోలీసులు ఆరాతీయగా.. దుర్గానగర్‌కు చెందిన శ్రీనివాసులు కారణమని తెలిసింది. అతడు ప్రేమ పేరుతో బాలికను లోబరుచుకున్నట్లు బాలిక తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

రామగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన నసనకోట ముత్యాలమ్మ దేవత ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి నరసింహరాజు, పోలీసులు పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయంలో మూడు హుండీలు ఉండగా ఒకటి సోమవారం రాత్రి చోరీకి గురైంది. మిగిలిన రెండు హుండీలను లెక్కించగా రూ. 3,80,817 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీకి చర్యలు : ఎంపీడీఓ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆవిష్కరించి, పాఠశాల హెచ్ఎంలకు మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకా వేయాలి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎన్ఎస్‌గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో పిల్లలకు వేసే టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. మండల వైద్యాధికారి రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ బుధవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మండలంలో ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్పల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోదనపల్లి రైతుసేవా కేంద్రంలో కంది కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి సీ చన్న వీరస్వామి తెలిపారు. గత ఖరీఫ్‌లో కంది సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఉత్తమ రైతుకు అభినందనలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పి. సిద్ధరాంపురం రైతు రమేష్‌నాయుడు జనవరి 26న ఢిల్లీలో ఉత్తమ జాతీయ అవార్డును అందుకున్నారు. సంబంధిత పత్రాలను బుధవారం ఆయన భార్య గ్రామ సర్పంచ్ శ్రీదేవికి జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ కన్వెన్షన్ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా అందజేసి, అభినందించారు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గార్లదిన్నె, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇల్లూరుకు చెందిన మునెమ్మ (64) అనే వృద్ధురాలు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఇల్లూరు ఎస్సీ కాలనీలో కుమారులతో కాకుండా, ఒక్కతే మరో ఇంట్లో ఉండేది. ఈ నెల మూడో తేదీ రాత్రి విద్యుత్ లేకపోవడంతో కొవ్వొత్తి వెలిగించి నిద్రిస్తోంది. అయితే కొవ్వొత్తి కింద పడి మునెమ్మ చీరకు అంటుకుంది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, కుమారులు వచ్చి మంటలను ఆదుపుచేశారు. అయితే అప్పటికే తీవ్రంగా గాయపడిన మునెమ్మను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ ఫిరోజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ డ్రైవర్...

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న డ్రైవర్ బుధవారం మృతి చెందాడు. ఈనెల 2వ తేదీ రాత్రి గంగానగర్‌కు చెందిన మాదిగ అనిల్(27) బైక్‌పై వెళ్తుండగా తపోవనం సర్వీస్ రోడ్డులో ఆవును తప్పించబోయి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ప్రమాదంపై నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాములకు నిప్పు

రాప్తాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రమైన రాప్తాడులో రైతు దండు శివయ్యకు చెందిన గడ్డివాములకు నిప్పంటుకుని పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ లేదా సిగరెట్లు అంటించుకుని గడ్డివాముల సమీపంలో అగ్గిపుల్ల వేయడంతో మంటలు చెలరేగి ఉంటాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ సమీపంలో రైతు శివయ్య వేరుశనగ, వరిగడ్డి, వట్టి సొప్ప వాములు వేసుకున్నాడు. వాటికి బుధవారం మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. అయితే అనంతపురం ఫైర్ కార్యాలయంలో వాహనాలు అందుబాటులో లేవు. దీంతో ఫైర్ వాహనం ఆలస్యంగా చేరుకుంది. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. ఫైర్ సిబ్బంది ఆ ప్రాంతంలో మంటలను ఆర్పివేశారు. నాలుగు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, నాలుగు ట్రాక్టర్ల వరిగడ్డి, నాలుగు ట్రాక్టర్ల వట్టి సొప్ప కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ. 3లక్షలు నష్టం వాటిల్లినట్టు ఫైర్ సిబ్బంది నివేదిక తయారుచేశారు.

గొర్రెల సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

కనగానపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల, కుర్లపల్లి గ్రామాల్లో గొర్రెల పెంపకం దారుల సొసైటీ అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో బుధవారం ఎన్నికల అధికారులు శేఖర్, మౌలాలిబాషా సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. తూంచెర్లకు ఎలువ నాగభూషణం, కుర్లపల్లికి బాడమల్లు శంకర్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను టీడీపీ నాయకులు తలారి రాజప్ప, నరసప్ప, ఆదెప్ప, బాడమల్లు, రమేష్, సధాకర్ అభినందించారు.

● రామగిరి: మండలపరిధిలోని కుంటిమద్ది గ్రామ గొర్రెలు, మేకల సొసైటీ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కమతం రమేశ్, ఉపాధ్యక్షుడిగా గోసే ప్రసాద్, డైరెక్టర్లుగా బన్యాల నాగార్జున, దాసరి ముత్యాలప్ప, గోసే నాగభూషణ, రెబ్బల శ్రీరాములు, చినగొండ్ల రఘురామును ఎన్నుకున్నారు. వారికి టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య శాలువాలు కప్పి అభినందించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, కమతం కిష్టప్ప, తిరుపాలప్ప, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ పల్లి రోడ్డుకు మోక్షం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీపల్లి రోడ్డు పనులు దాదాపు ఆరేళ్ల తరువాత ప్రారంభమయ్యాయి. 2019లో అప్పటి టీడీపీ హయాంలో రోడ్డు నిర్మాణానికి అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత నిధులు కేటాయించి, పనులు ప్రారంభించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే పరిటాల సునీత గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తిరిగి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు ధర్మవరపు మురళి, ఆలమూరు నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ తదితరులు బుధవారం పనులను పరిశీలించారు.

రాత్రిళ్లు కమ్మేస్తున్న పొగ



డంపింగ్ యార్డు

- పిల్లలు, వృద్ధులకు శ్వాసకోస సమస్యలు
- డంపింగ్ యార్డుతో నిత్యం అవస్థలు
- తరలింపు చర్యలు చేపట్టాలని వేడుకోలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ విషపు పొగ కోరల్లో చిక్కుకుంది. డంపింగ్ యార్డు పంచాయతీకి అనుకుని ఉండటంతో స్థానికులు దుర్వాసన ఇతరత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రైతే డంపింగ్ యార్డు చుట్టుపక్కల వారి అవస్థలు వర్ణనాతీతం. రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో దాదాపు 14 కాలనీలున్నాయి. వీటి పరిధిలో మూడువేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపు పది వేలకు పైగా జనాభా ఉంటోంది. వీరంతా డంపింగ్ యార్డుతో ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో రాజీవ్‌కాలనీ, పొట్టిశ్రీరాములు నగర్, మిట్టమీద కొట్టాల, రిక్షా కొట్టాల, కళాకారుల కాలనీ, భగసింగ్ నగర్, మహదేవనగర్, గణేనాయక్‌కాలనీ, ముత్యాలమ్మకాలనీ, ప్రియాంకనగర్, సత్యసాయి నగర్ ప్రాంతాల ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రాంతాలతో పాటు నగరంలోని లెక్చర్స్ కాలనీ, అరుణోదయకాలనీ, నారాయణపురం పంచాయతీలోని రాయల్ నగర్, స్టాలిన్ నగర్, ప్రహ్లాదనగర్, తపోవనం ప్రాంతాల వారు డంపింగ్ యార్డుతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం అయితేనే కాలనీల్లోకి వస్తుందని, రాత్రివేళల్లో ఇళ్లన్నీ పొగతో కమ్ముకు పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు.

ఎన్ని అర్జీలు ఇచ్చినా పరిష్కారం లేదు

డంపింగ్ యార్డును తరలించాలని చాలా సార్లు మున్సిపాల్టీ అధికారులకు అర్జీలు ఇచ్చాం. డంపింగ్ యార్డు చుట్టుపక్కల వారందరం కలసి మున్సిపాల్టీ కార్యాలయం వద్ద ధర్నా కూడా చేశాం. అయినా సమస్యకు పరిష్కారం కాలేదు. రాత్రివేళల్లో డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగతో మరింత ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యపై సోమవారం కలెక్టర్‌ను కలసి విన్నవించాం. - కిష్టప్ప, లెక్చరర్స్ కాలనీ

అలాగే డంపింగ్ యార్డులో కాలుతున్న వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోందని, పొగకారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. శ్వాసకోస, ఊపిరితిత్తులు, గొంతు సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మరీ ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల అవస్థలు చెప్పలేమంటున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నాతాధి కారులు స్పందించి డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించేందుకు చర్యలు తీసుకుంటేనే తప్ప తమ ఇబ్బందులు తొలగవంటున్నారు.

ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలి



డంపింగ్ యార్డుతో రాజీవ్‌కాలనీ పంచాయతీతో పాటు డంపింగ్ యార్డు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు చుట్టూ దాదాపు నాలుగైదు కిలో మీటర్ల వరకు ఇబ్బందులున్నాయి. తరలిస్తామంటూనే గత పాలకులు ఐదేళ్ల పాలన కాలన్నీ ముగించారు. యార్డును అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ప్రస్తుత పాలకులు, ఉన్నాతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. - కనుమ చౌడయ్య, ప్రియాంకనగర్

పొగతో అవస్థలు పడుతున్నాం



డంపింగ్ యార్డు నుంచి నిత్యం వెలువడే పొగ కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నాం. రాత్రిపూట పొగతో ఇళ్లు ఏమాత్రం కనిపించవు. సాయంత్రం నుంచి ఇళ్లలోకి పొగ చేరడం మొదలై రాత్రికి ఇళ్లన్నీ కప్పుకుపోతాయి. ఇళ్లలోకి పొగ చేరుతోంది. రోజు ఇదే పరిస్థితి. ఫలితంగా పిల్లలు, పెద్దలు అందరూ ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యానికి గురికావాల్సి వస్తోంది. పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బంది పడుతున్నారు. - షేక్ ఇమామ్, రాజీవ్‌కాలనీ

మినిమమ్ టైం స్కేల్ అమలు చేయండి

● స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఎంపీఈఓల వినతి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో గత పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌ను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు భాగ్యలక్ష్మి, తిరుపతయ్య, నాగరాజు వినతి పత్రం అందజేశారు. ఎంపీఈఓలకు సమాన పనికిసమాన వేతనం ఇవ్వాలని రెండేళ్ల క్రితం అప్పటి వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ప్రభుత్వానికి ప్రతిపాదించారన్నారు. అప్పటి వైసీపీ హయాంలో ఫైల్‌ను పక్కనపెట్టారన్నారు. ఇప్పుడైనా మినిమమ్ టైం స్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి తపోవనం సమీపాన బుధవారం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో కూలీ నరసింహులు(53) మృతిచెందాడు. సుఖ్‌దేవ్‌నగర్‌కు చెందిన నరసింహులు కూలి పనులకు వెళ్తుండేవాడు. కొడుకును కళాశాలలో దింపి ఇంటికి వస్తుండగా తపోవనం సమీపాన ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టు ఉమన్ అదృశ్యం

అనంతపురం రూరల్ మండలం కందుకూరులో పోస్టు ఉమన్‌గా పనిచేస్తున్న యువతి లక్ష్మీదేవి కనిపించకుండా పోయింది. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లికి చెందిన లక్ష్మీదేవి పోస్టు ఉమన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం కందుకూరుకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తండ్రి కదిరప్ప ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫేక్ ఫోన్ కాల్స్ నమ్మకండి: కమిషనర్

నగర పాలక సంస్థ పరిధిలో కొందరు అపరిచిత వ్యక్తులు తాము కమిషనర్, కార్పొరేషన్ అధికారులం అంటూ ఫేక్ కాల్స్ చేస్తున్నారనీ, వాటిని నమ్మవద్దని ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 6300905117, 7980750650 నంబర్ల నుంచి వ్యాపార వర్గాలకు తప్పుడు ఫోన్ కాల్స్ చేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు తక్షణమే చెల్లించాలనీ, ఫేక్ అకౌంటు నంబర్లు, ఫోన్ పే ద్వారా చెల్లించాలని తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్‌లోగానీ, సచివాలయంలోగానీ చెల్లించాలని సూచించారు.

'అభివృద్ధి పనుల్ని అడ్డుకుంటున్న వైసీపీ నాయకులు'

రాప్తాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాప్తాడులో అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కొందరు వ్యక్తులను రెచ్చగొడుతున్నారని రాప్తాడు గ్రామస్థులు గంజి రాముడు, పంపు దుబ్బ నారాయణ, జూటూరు నాగరాజు, బోయ ప్రసాద్, బ్రహ్మయ్య, మాన్లుకోసే సూర్యనారాయణ, కేశవ తదితరులు ఆరోపించారు. వారు బుధవారం రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి చొరవతో పండమేరు వంక పక్కన సర్వే నంబర్ 226లోని పదెకరాల ప్రభుత్వ వంక పోరంబోకు ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటుకు అధికారులు భూమి చదును చేస్తున్నార న్నారు. అయితే కొందరు వైసీపీ నాయకులు గ్రామంలోని కొంత మందికి లేనిపోని మాటలు చెప్పి అడ్డంకులు సృష్టిం చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

'బంగారు బుల్లోడి' పై కొనసాగుతున్న విచారణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ప్రైవేట్ స్కూళ్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న బంగారు బుల్లోడుపై విచారణ సాగుతోంది. ఇటీవల ఆయన అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. అయితే జిల్లా విద్యాశాఖాధికారులు ఆయనను కాపాడే యత్నం చేస్తున్నట్లు తెలిసింది. విచారణ చేయాలని సాక్షాత్తు కమిషనర్ నుంచే ఆదేశాలు వచ్చినా, జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాలయం నుంచి కాలు కదపకుండా విచారణ చేసినట్టు తెలిసింది. 'అంతా బాగుంది' అన్నట్టుగా నివేదిక ఇవ్వాలని చూసినట్టు సమాచారం. బహిరంగంగానే ఆయన అక్రమాలను కరస్పాం డెంట్లు, ప్రిన్సిపాళ్లు చెబుతుంటే, అధికారులకు ఏం వినిపించకపోవడం అనేక ఆరోపణలకు బలం ఇస్తోంది. మరో వైపు సమగ్రశిక్ష అధికారులు సైతం విచారణకు దిగారు. సంబంధిత అధికారికి నోటీస్ జారీ చేశారు. విచారణాధికారులు క్వశ్చనరీ అందజేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించినట్టు సమాచారం.

ప్రజా సంక్షేమం కోసం పోరాటాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, లౌకికతత్వ పరిరక్షణకు ప్రజా పోరాటాలను బలపరుద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప పిలుపునిచ్చారు. ఈ నెల 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల్లో అనంతపురం జిల్లా కార్యవర్గం పాల్గొంది. ఈ నేపథ్యంలో మహాసభ తీర్మానాల అమలుపై బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నల్లప్ప మాట్లాడారు. వివిధ ప్రజా సమస్యలపై 39 తీర్మానాలను మహాసభ ఆమోదించిం దన్నారు. వాటి అమలుకోసం రానున్న మూడేళ్లలో ప్రజా ఎజెండాతో చేపట్టే ప్రజా ఉద్యమాల ను ప్రతిఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలుగా ఉంటున్నాం

● న్యాయం చేయండి ● బాధితుల ధర్నా

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మండలం నందలపాడు గ్రామంలో ఆంజనేయస్వామి మాన్యం భూమిలో నివాసముంటున్న కుటుంబాలకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. వారు బుధవారం జిల్లా కేంద్రంలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... ఆంజనేయస్వామి మాన్యం భూమిలో సర్వే నెం.9లోని 12.67ఎకరాల భూమిలో 30 సంవత్సరాలుగా దాదాపు 1800 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. తమకు పట్టాలు మంజూరు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ సుముఖంగా ఉన్నప్పటికీ దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు అడ్డుకట్ట వేస్తున్నారని విమర్శించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా నివాసముంటున్న తమకు కాలనీలో కనీస వసతులు లేవన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ శాఖ అధికారులను కోరితే పట్టాలు చూపాలంటున్నారని తెలిపారు. దేవదాయశాఖ సహాయ కమీషనర్ ఇప్పటికైనా స్పందించి తమకు పట్టాలు మంజూరు చేయకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాన్యం భూమి నివాసితులు బాస్కర్, రత్నమ్మ, సుధాకర్, నల్లప్ప, రామాంజి, మారెక్క తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం బడ్జెట్

● సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ● ప్రతుల దహనం



నగరంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తాపత్రయం, శ్రమ అంతా కార్పొరేట్లను మరింత అభివృద్ధి చేసేందుకేనని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్, లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం క్లాక్‌టవర్ కూడలి వద్ద లేబర్ కోడ్‌లు, కేంద్ర వ్యతిరేక బడ్జెట్ ప్రతులను సీఐటీయూ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సీఐటీయూ నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మనోహర్, సురేంద్ర, శ్రీనివాసరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం విద్య : కార్మిక, రైతాంగ, ప్రజా ప్రతికూల కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నామంటూ ఏఐటీయూసీ నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఆ సంఘం నాయకులు బుధవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి, ఇతర నాయకులు రాజు, వేణుగోపాల్, వెంకటేష్, దుర్గాప్రసాద్, నాగరాజు, రఫీ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, వ్యసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నాయకులు మధుయాదవ్, వెంకటరెడ్డి, నేసేమధు, చంద్ర, నారప్ప, సుంకన్న శ్రీనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

● రాప్తాడు: కేంద్ర బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నాయకులు పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీజినల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● సబ్‌యూనిట్ అధికారులకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి సబ్ యూనిట్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయం లో బుధవారం సీజనల్ వ్యాధుల నియంత్రపై అనంతపురం, సత్య సాయి జిల్లాల సబ్‌యూనిట్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం గా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... దోమల వల్ల జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గన్యా, మెదుడు వాపు వంటి తీవ్రమైన వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఎండాకాలంలో నీటికా లుష్యం వల్ల వాంతులు, విరేచనాలు వంటి వాటి బారిన జనం పడ తారన్నారు. ఇప్పటినుంచే సబ్‌యూనిట్ అధికారులు సీజినల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో డీఎంఓ డాక్టరు ఓబులు, ఉమ్మడి జిల్లాల సబ్‌యూనిట్ అధికారులు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

టీకాల పంపిణీ పక్కాగా జరగాలి

వ్యాధి నిరోధక టీకాల పంపిణీని పక్కాగా నిర్వహించాలని వైద్యసిబ్బందికి డీఎంహెచ్ ఓ డాక్టరు ఈబీ దేవి సూచించారు. ఆమె బుధవారం జిల్లా కార్యాల యంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... కేటాయించిన సమయాల్లో టీకాలను తప్పకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టరు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలపై కమిటీ సభ్యుల ఆరా

జిల్లా సర్వజన ఆస్పత్రిలోని సమస్యలపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరాతీశారు. కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, రత్నమయ్య బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు పద్మజతో కలిసి ఆస్పత్రిలో పరిశీలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లి ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజల సహకారంతో సుపరిపాలన

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెల్లలోనే ప్రజల సహకారంతో సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తూ, సుపరిపాలనను అందిస్తున్నామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద బుడగ జంగాల కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును, గోకులం షెడ్డును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్ని వర్గాల ఆశలు నేరవేర్చేలా కూటమి ప్రభుత్వం ఆహర్నిశలు పనిచేస్తోందన్నారు. రానున్న కాలంలో కొత్త సంక్షేమ పథకాలు, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డీఈ అరుణ్‌కుమార్, ఎంపీడీఓ సాల్మన్ రాజ్, తహసీల్దార్ పుణ్యవతి, కన్వీనర్ అశోక్, ఎంపీపీ సునీత, టీడీపీ జిల్లా నేత పసుపుల శ్రీరామిరెడ్డి, నాయకులు రవీంద్ర, ఎస్ నారా యణస్వామి, కేశన్న, లక్ష్మీనారాయణ, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వేలం వాయిదా

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్‌లో రుసులు వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి 2025-26సంవత్సరానికి నిర్వహించిన కూరగాయల మార్కెట్ వేలం ఈనెల 11వతేదీకి వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ నగర కమిషనర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. డిప్యూటీ కమిషనర్(డీసీ) వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేశారు. సెక్యూరిటీ ధరావతు తదితరాలను చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనటానికి అర్హులన్నారు. అలాగే మటన్ మార్కెట్ రుసుము వసూలు వేలాన్ని 2025- 26కు సంబంధించి అలీం అనే వ్యక్తి రూ.6.80 లక్షలకు దక్కించుకున్నారు.

'విద్యతోపాటు కళలు, సాహిత్యం ఎంతో అవసరం'

గార్లదిన్నె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశం పురోభివృద్ధి సాధించడంలో విద్యతోపాటు కళలు, సాహిత్యం ఎంతో దోహదపడుతాయని మర్తాడు, కోటంక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మణిమాల పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు ప్రాథమిక పాఠశాలలో జనవరి నెలలో ముంబాయిలోని మాస్టర్ ఆర్ట్స్ కాంపిటీషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మర్తాడు పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆ చిన్నారులకు కాంపిటీషన్ వారు పోస్టు ద్వారా బంగారు పథకాలు, ప్రశంస పత్రాలు పంపారు. బుధవారం పాఠశాలలో అభినందనసభ ఏర్పాటు చేశారు. చిత్రలేఖనంలో ప్రతిభ కనబరచిన బానుప్రకాష్, అయేషా, యామిని, హసీనా, సుదర్శన్, జాస్మిన్, రేణుకుమార్, నీరాజ్, భార్గవి, ముస్తాన్, ఉదయశ్రీ, నాగచైతన్య, జస్‌కుమార్, లోకేశ్వరీ, ఖాసింకు బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, వసుంధర, ఆదినరసమ్మ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల తమిళనాడు లోని మధురైలో నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటిన చంద్రమోహన్ రెడ్డి, యోగినాథ్, రిత్విక్‌రెడ్డి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. త్వరలో ఇండోనేషియాలో జరిగే అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన వారిని మాస్టర్ కేదార్‌నాథ్ అభినందించారు.

8న జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈ నెల 8న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్ బుధవారం తెలిపారు. ఎంపికైన వారు త్వరలో అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటార ని తెలిపారు. వివరాలకు సెల్ నం. 9703713192ను సంప్రదించాలని కోరారు.

కరాటేలో నారాయణ పాఠశాల విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. విశాఖపట్నంలో మహిర షోటోకాన్ కరాటే డో ఇండియా నిర్వహించిన ఎనిమిదో ఆల్‌స్టైల్స్ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్- 2025 పోటీల్లో భారత్, శ్రీలంక, భూటాన్, మలేషియా, ఇంగ్లాండ్, నేపాల్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కటా విభాగంలో నారాయణ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హసినీరెడ్డి, కుమిటే విభాగంలో సుదీప్ రెడ్డి, మరో విద్యార్థి రేయాన్స్ రెడ్డి బంగారు పతకాలు సాధించారు. విజేతలను నారాయణ విద్యాసంస్థల ఏజీఎం సుధాకర్ రెడ్డి, ప్రిన్సి పాల్ నీలిమ, ఏఓ నవాజ్, డీన్ సుమంత్, పీఈటీ ఓబన్న అభినందించారు.

ఇంటర్వ్యూ

అభివృద్ధికి సమష్టి కృషి: ఎంపీడీఓ


విజయభాస్కర్, ఎంపీడీఓ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమష్టి కృషితో అబివృద్ధి చేస్తున్నామని, మండలంలో ఏగ్రామంలోనైనా సమస్యలు ఎదురైతే ప్రజలు తమ దృష్టికి తేవాలని తప్పకుండా పరిష్కరిస్తామని బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఆయన్ను బుధవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ చేయగా పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని గ్రామ పంచాయతీలు, సచి వాలయాలు ఉన్నాయి. జనాభా ఎంత?

జవాబు: మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 15 సచివాలయాలు ఉన్నాయి. 67,814 మంది జనాభా ఉన్నారు.

ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్యానికి ఏ చర్యలు చేపడుతున్నారు?

జవాబు: మండలంలో ప్రతి గ్రామానికి ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్లు నిత్యం చెత్త సేకరణ చేస్తారు. దానిని చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు.

ప్రశ్న: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వివరించండి?

జవాబు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్లు, అవసరమైనచోట్ల డ్రైనేజీల నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన అబ్ధిదారులందరులకు సంక్షేమం అందుతోందా?

జవాబు: గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. దీనిపై సచివాలయ సిబ్బందితో ఇంటింటి సర్వే కూడా చేయిస్తున్నాం.

ప్రశ్న: మండలంలో అభివృద్ధి పనులకు నిధులు ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల ద్వారా రూ. 58. 68 లక్షల నిధులను మంజూరు చేశాం. పల్లెపండగలో భాగంగా 86 సీసీరోడ్లకు రూ. 3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ కింద 31 మినీగోకులాలు మంజూరయ్యాయి. అందు లో 12 పూర్తికాగా, 19 నిర్మాణంలో ఉన్నాయి.

సంక్షిప్త వార్తలు

వైసీపీది కపట ప్రేమ: టీడీపీ

కూడేరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని, ఇప్పుడేమో ఆ పార్టీ నాయకులు విద్యార్థులపై కపట ప్రేమ చూపుతున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు ఆ పార్టీనాయకులు విద్యార్థుల సమస్యలపై నిరసనకు దిగడం సిగ్గు చేటన్నారు. నాడు చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే ఇలా చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు. నాయకులు జయప్రకాష్ గౌడ్, మరుట్ల రవి, వెంకటేష్, ఈడిగ వెంకటరాముడు, సురేష్, ధనుంజయ, దామోదర్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):పట్టణ శివారులోని ఎస్టేట్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యంను మంగళవారం రాత్రి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎస్టేట్ ప్రాంతంలో ఓ ఖాళీ ప్రదేశంలో 620కేజీల బియ్యాన్ని 127 బ్యాగుల్లో నిల్వ ఉంచారన్నారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామన్నారు. తర్వాత వాటిని సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మీకు అప్పగించామన్నారు. నిల్వ ఉంచిన గుత్తికి చెందిన శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

విడపనకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోగల గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆరోగ్యశాఖ విద్యా బోధకుడు వేణుగోపాల్ బాల్యవివాహాలపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. చిన్నతనంలో వివాహం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తతెత్తుతాయన్నారు. బాలికలను బాగా చదవనివ్వాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు జిరిపితే శిక్షకు అర్హులవుతారని చెప్పారు. బాల్య వివాహాలు నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బలవంతపు రాజీనామా

యాడికి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు బలవంతంగా ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌తో రాజీనామా చేయించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ధనాంజనేయ ఏనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఉద్యోగానికి రాజీనామా చేయాలని అతడిపై టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. అధికారులతో నోటీసులు కూడా జారీ చేయించారు. దీనిపై ధనాంజనేయ కోర్టుకు వెళ్లారు. ఇదిలా ఉండగా.. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో టీడీపీ నాయకులు అతడిని బెదిరించి రాజీనామా పత్రంపై బలవంతంగా సంతకం పెట్టించారు. ఈ తతంగం అధికారుల ముందే జరిగింది. అయినా వారు చూసీచూడనట్లు ఉండడం గమనార్హం.

చికిత్స పొందుతూ హిజ్రా మృతి

విడపనకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరుకు చెందిన హిజ్రా బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. ఎస్ఐ మురహరి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హిజ్రా దేవరాజు, అలియాస్ ప్రియాంక (30) మూడు రోజుల క్రితం డీజిల్ మీద పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. కాగా ఆ హిజ్రా హావళిగికి చెందిన ఓ వ్యక్తిని నమ్మి రూ. 12లక్షలు వరకూ డబ్బు ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఆ వ్యక్తి డబ్బును తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

పౌల్ట్రీ ఫాం పరిశీలన

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో గల పౌల్ట్రీ ఫాంను ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోడిగుడ్లు, కోడి మాంసంపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. ప్రజల్లో ఈ అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయడానికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పర్వతప్ప రథోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పర్వతప్ప స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో రథాన్ని లాగారు. రథంపైకి భక్తులు అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

అడవి జంతువుల దాడిలో పంటలు ధ్వంసం

● ఆందోళన చెందుతున్న రైతులు


ఇటీవల జంతువుల దాడిలో ధ్వంసమైన అరటిచెట్లు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో గల పొలాల్లో కొద్దిరోజులుగా అడవిజంతువుల దాడి అధికమైంది. అటవీ ప్రాంత సమీపంలో గల పొలాల్లోకి రాత్రి వేళల్లో అడవి జంతువులు వచ్చి పంటల్ని నాశనం చేస్తున్నాయి. ఇటీవల గ్రామానికి చెందిన రైతులు నర్సిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నలిపిరెడ్డి, జయరాంనాయుడు, సహదేవ రెడ్డికి చెందిన అరటి తోటల్లోకి జంతువులు చొరబడి కొద్దిమేర అరటి చెట్లను ధ్వంసం చేశాయి. కోతకు వచ్చిన అరటి చెట్లు ధ్వంసమవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ జంతువుల అడుగులను బట్టి చూస్తే చిరుత ఏమోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు పంటలను పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేస్తామని, ఫారెస్ట్ వారి ఆధ్వర్యంలో ఏ జంతువులు ఇలా చేస్తున్నాయో గుర్తింపు చేసి వాటిని రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏది ఏమైనా జంతువుల భారి నుంచి తమ పంటల్ని కాపాడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి: సీఐటీయూ


కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభు త్వం రద్దు చేసి లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చిందన్నారు. ఇవి అమలు జరిగితే వేతనాలు, సామాజిక భద్రత, వృత్తి భద్రత, ఆరోగ్య భద్రత తదితరాలను కార్మికులు కోల్పోతారన్నా రు. ఇప్పటికే శ్రీరామిరెడ్డి, సత్యసాయి మంచినీటి పథకాల కార్మికులకు 6 నెలల వేతనాలు, పీఎఫ్‌లలో అవకతవకలు ఉన్నాయన్నారు. కా వున లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, శ్రీరామిరెడ్డి, సత్యసాయి కార్మికులు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. కార్మికుల హక్కులు కాలరాసే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, పట్టణ అధ్యక్షుడు జగదీష్, మున్సిపల్ యూనియన్ నాయకులు నరసయ్య, ఎస్‌కేఎం బాషా, రంగనాయకులు, తిరుపాలు, ప్రేమ్‌కుమార్, రవి, రాజేష్, రంగమ్మ, శంకరమ్మ, అంజనమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గుత్తి: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్‌తో పట్టణంలోని సీఐటీయూ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు అనంతరం డీప్యూటీ తహసీల్దారు లలితకు వినతి పత్రం అందజేశారు. నాయకులు నిర్మల, మున్సిపల్ కార్మికులు రాజు, రాజా, సూరి, రామాంజినేయులు, సీపీఎం నాయకులు రామకృష్ణ, మద్దిలేటి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. బంధువులకు అప్పగింత

కణేకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తప్పిపోయిన ఓ బాలుడిని పోలీసులు గ్రామస్థుల సహకారంతో బంధువుల వద్దకు చేర్చారు. అజిత్ అనే ఆరేళ్ల బాలుడు బుధవారం మధ్యాహ్నం స్థానిక ఉరవకొండ రోడ్డులో ఏడుస్తూ కనిపించాడు. అక్కడే ఉన్న గీతాంజలి టెక్స్‌టైల్స్ యజమాని ప్రకాష్ ఆ బాలుడిని గమనించి తన దుకాణంలో కూర్చోబెట్టి వివరాలు ఆరా తీశారు. తన పేరు అజిత్ అని, అమ్మపేరు మౌనిక అని చెప్పి గ్రామం తెలియదన్నాడు. దీంతో అతను ఆ బాలుడి ఫొటో తీసి సోషల్ మీడియాలో విషయాన్ని వివరించారు. సోషల్ మీడియాలో బాలుడిని చూసిన మాల్యంగ్రామానికి చెందిన బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పోలీసులు కూడా అక్కడికి చేరుకుని బాలుడిని బంధువులకు అప్పగించారు.

రథం తయారీకి విరాళం

కూడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జోడు లింగాల సంగమేశ్వర స్వామికి నూతనంగా నిర్మిస్తున్న రథం తయారీకి స్థానిక నేసే కుల సంఘం వారు రూ. 51,108లను విరాళం అందజేశారు. ఆలయం ఆవరణలో రథం అభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం నగదు అందజేశారు. కూడేరు నేసే కుల సంఘం అధ్యక్షుడు బత్తల శివప్రసాద్, సభ్యులు బుట్టా వెంకటేష్, నేసే నారాయణ, ఎర్రిస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లుగా ఉంటున్నాం..

● న్యాయం చేయండి ● బాధితుల ధర్నా

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మండలం నందలపాడు గ్రామంలో ఆంజనేయస్వామి మాన్యం భూమిలో నివాసముంటున్న కుటుంబాలకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. వారు బుధవారం జిల్లా కేంద్రంలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... ఆంజనేయస్వామి మాన్యం భూమిలో సర్వే నెం.9లోని 12.67ఎకరాల భూమిలో 30 సంవత్సరాలుగా దాదాపు 1800 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. తమకు పట్టాలు మంజూరు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ సుముఖంగా ఉన్నప్పటికీ దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు అడ్డుకట్ట వేస్తున్నారని విమర్శించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా నివాసముంటున్న తమకు కాలనీలో కనీస వసతులు లేవన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ శాఖ అధికారులను కోరితే పట్టాలు చూపాలంటున్నారని తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఇప్పటికైనా స్పందించి తమకు పట్టాలు మంజూరు చేయకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాన్యం భూమి నివాసితులు భాస్కర్, రత్నమ్మ, సుధాకర్, నల్లప్ప, రామాంజి, మారెక్క తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల పరుష

కుందుర్పి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా బుధవారం ఉట్లమాను ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. చివరకు కుందుర్పి గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు ఉట్లమాను ఎక్కి శభాష్ అనిపించుకున్నాడు. సర్పంచ్ మారుతేశ్వరి, గ్రామ పెద్దలు ఆ యువకుడిని అభినందించి నూతన వస్త్రాలు, రూ. 1116 నగదును అందజేశారు.

విద్యుత్ అదాలత్

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ ఏడీ గురురాజ్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ జరిగింది. కార్యక్రమంలో ఏఈలు బాలచంద్ర, భరత్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పొలాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. మరికొందరు లోఓల్టేజి సమస్యతో బాధపడుతున్నామని, సమస్య పరిష్కరించాలని, వ్యవసాయానికి విద్యుత్ 8 గంటల విద్యుత్ కల్పించాలని విన్నవించారు. స్పందించిన ఏడీ రాయదుర్గం నుంచి కొత్త లైన్ మంజూరు అయ్యిందని, త్వరలో పనులు ప్రారంభించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

ఉరవకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రిలో రోగులకు మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో ఆర్వో ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను రెన్యూ సంస్థ బుధవారం ఏర్పాటు చేసింది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు, ప్రజలకు తాగు నీటి కష్టాలు తీరాయి. అలాగే ఆ సంస్థ ఆసుపత్రి ఆవరణలో సోలార్‌లైట్లను కూడా ఏర్పాటు చేసింది.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు


గంగాజలాన్ని తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో బుధవారం సాయంత్రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నగరేశ్వర విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆర్యవైశ్యులు గంగాజలాన్ని ఊరేగింపుగా తెచ్చి ఆలయంలో గంగపూజ, మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం నిర్వహించారు. అనంతరం హోమాలు ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజామున విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరగనుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ్మిండ్ర ముత్త మల్లికార్జునశెట్టి, ఆర్వేటి లేపాక్షి శెట్టి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అక్కన్నపల్లె గ్రామం వద్ద పేకాటకేంద్రంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో పట్టణ సీఐ సాయిప్రసాద్ సిబ్బందితో కలిసి పేకాట కేంద్రంపై దాడులు నిర్వహించారు. అందులో పేకాటాడుతున్న 18 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3.09 లక్షల నగదు, 17సెల్ ఫోన్‌లు, 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెళుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఉరవకొండ మండలం అమిద్యాలకు చెందిన నాగరాజు(40) తన తల్లి నాగమ్మతో కలిసి ఈ నెల 2వ తేదీన బైక్‌పై స్వగ్రామం నుంచి కళ్యాణదుర్గం మండలం హులికల్లుకు బయలుదేరాడు. బెళుగుప్పలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని అక్కడే ఉన్న ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గోనె సంచుల దుకాణంలో అగ్ని ప్రమాదం

ఉరవకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బళ్లారి బైపాస్‌లో దేవాంగ కళ్యాణమండపం ఎదురుగా ఉన్న గోనె సంచుల దుకాణంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జాఫర్ అనే వ్యక్తి గోనె సంచుల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సంచులన్నీ కాలి బూడిదయ్యాయి. సుమారు 200పైగా సంచుల గట్టాలు కాలి బూడిద అయ్యాయి. రూ.2లక్షల మేరకు నష్టం జరిగనట్లు బాధితుడు తెలిపాడు.

పోస్టర్ల విడుదల

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వనటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సీఐ మనోహర్ కానిస్టేబుల్, ఆర్‌ఆర్‌బీ, గ్రూప్‌డీ పరీక్షలకు సంబంధించిన ఉచిత కోచింగ్ సెంటర్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు ఇలాంటి కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, వెంకీ, రాజేష్, కన్నయ్య, రంగ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులను పరిశీలించారు. అ నంతరం గీత కార్మికులతో సమావేశం నిర్వహించి వారికి కేటాయించిన మద్యంషాపుల గురించి చర్చించారు. అనంతరం స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కర్ణాటక మద్యంపై నిఘా ఉంచి సరిహద్దు దాటనివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మహేష్‌కుమార్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


పామిడిలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఉరవకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటస్వామి చౌదరి సూచించారు. ఆస్పత్రిలో బుధవారం గుండెకు సంబంధించిన చికిత్స స్టెమిపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చినపుడు ఛాతీ నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం రావడం, గుండె దడ, స్పృహకోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అలాంటి లక్షణాలు ఉంటే మొదటి గంటలోపే ఆస్పత్రికి వస్తే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి రూ. 45వేలు విలువ గల టెనెక్టెప్లెస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తామని అన్నారు. తద్వారా గుండెపోటును నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని సీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ శివకార్తీకేయ రెడ్డి రోగులకు స్టెమి చికిత్సపై అవగాహన కల్పించారు. గుండె జబ్బుల మరణాలను నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం స్టెమి చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఈమేరకు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. హెడ్ నర్స్ శివకుమారి, ఎద్దులపల్లి పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేఏ పాల్‌కు మతి భ్రమించింది: టీడీపీ

పుట్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కి మతిభ్రమించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురించి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. లోకేశ్‌పై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం లోకేశ్ అహర్నిశలు కష్టపడుతున్నారని, అది కేఏ పాల్‌కి నచ్చడం లేదని అన్నారు. అందుకే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలన్నారు. లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అధ్వానంగా చిన్నంపల్లి రహదారి

● ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్న వాహనదారులు


కంకర తేలిన చిన్నంపల్లి రోడ్డు

శెట్టూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపల్లి నుంచి చిన్నంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి తీవ్ర అధ్వానంగా ఉంది. గుంతలు పడి, కంకరతేలి ఉండడంతో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు అలాగే ఉందని, ఇంతవరకూ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఏదేని అత్యవసర సమయాల్లో పట్టణాలకు వెళ్లాలంటే నరకం చూస్తున్నామంటున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందంటున్నారు. దీనికి తోడు ఇరువైపులా ఏపుగా ముళ్లకంపలు కూడా పెరిగాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తారురోడ్డు వేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలి



త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి గ్రామాల ప్రజలకు సులభతరమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

\- గిరీష్, చిన్నంపల్లి

ఈ రోడ్డుకు తారు వేసేదెన్నడో?

● కంకర వేసి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు


కంకర వేసి వదిలేసిన రోడ్డు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని కల్లుదేవనహళ్లి నుంచి బండూరు గ్రామం మీదుగా బొమ్మనహాళ్‌కు వెళ్లే రోడ్డుకు అధికారులు కంకర వేయించారు. అయితే తారు వేయ లేదు. దీంతో కంకర రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనుల్ని మూడు భాగాలుగా చేపట్టి రూ.55 లక్షలు, రూ.35 లక్షల వ్యయంతో వారం క్రితం రెండు పనులను ప్రారంభించారు. ఇందులోభాగంగా కొంత మేరకు కంకర వేసి వదిలేశారు. మళ్లీ ఇంతవరకు తారు వేయలేదు. దీంతో వాహనదారులు ఆ కంకరపై ప్రయాణించాలంటే నరకం చూస్తున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు టైర్ల కింద నుంచి కంకర రాళ్లు ఎగిసి పడుతుండడంతో సమీపంగా వచ్చే వారు గాయాలపాలవుతున్నారు. మరోవైపు దుమ్ము ధూళితోనూ వాహనదారులు అవస్థ పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే రోడ్డు పనుల్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

● ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంజునాథ కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానిక ఆస్పత్రి వద్ద బంధువులు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వద్దకు బుధవారం పెద్ద ఎత్తున బంధువులు, కుటుంబసభ్యులు చేరుకుని మృతుడి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలంటూ సుమారు గంటన్నర పాటు రోడ్డుపై బైఠాయించారు. సీఐ జయనాయక్, రూరల్ సీఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమానితో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని భరోసా ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

పోస్ట్ కార్డుల ద్వారా ప్రధానికి కృతజ్ఞతలు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో మంచి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినందుకుగాను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బీజేవైఎం నాయకులు విద్యార్థులు, యువతతో కలిసి పోస్ట్ కార్డుల ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉందన్నారు. గతప్రభుత్వాల కంటే ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం చాలా గొప్ప నిర్ణయాలు తీసుకుందన్నారు. పేద ప్రజలకు మద్దతుగా నిర్ణయాలను తీసుకున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వాల్మీకి రవితేజ, జిల్లా కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.